క్లుప్తంగా...

నేడు ఓయూకు విద్యాశాఖ మంత్రి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు నేడు (21న) రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి రానున్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండో–పసిఫిక్ స్టడీస్ ప్రారంభానికి దూరవిద్య కేంద్రంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఓయూ అధికారులతో పాటు రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఎమ్మెల్సీ సురభివాణీదేవి హాజరవుతారన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

అమీర్‌పేట: ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు. అమీర్‌పేట, హైటెక్ సిటీలోని ఆసుపత్రిలో ఈ నెల 31 వరకు యుఎస్‌జీ అబ్డామిన్, లివర్ ఫంక్షన్ పరీక్ష, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని వైద్యులు శ్రీమన్నారాయణ, శరణ్, మొయిన్, భార్గవ్, ప్రతినిధి హృషికేశ్ తెలిపారు.

ఫీజుల పెంపుపై ఏబీవీపీ ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ కోర్సులు, పరీక్ష ఫీజుల పెంపు పై ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గురువారం ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి పరుశురాం ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని భవనం ఎదుట బైఠాయించి డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజు, పీ హెచ్‌డీ ట్యూషన్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీసీ కార్యాలయంలోకి చొ చ్చుకు వెళ్లేందుకు గేటుపై నుంచి దూకేందుకు య త్నించగా పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో హరిప్రసాద్, జీవన్, రాజు, శ్రీధర్, కైలాష్, ప్ర శాంత్, వికాస్, భాను, గణేష్, రాహుల్, జినిత్, సాయి, శ్రుతి, సంజన, ప్రియ, గంగారాం పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు

రసూల్‌పురా: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా కంటోన్మెంట్‌లో జోరుగా ఇఫ్తార్ విందు కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మజీద్ కమిటీ సహకారంతో అన్ని వార్డుల్లో జరుగుతున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో వివిధ పార్టీల నేతలు పాల్గొంటున్నారు. మూడవ వార్డు సిక్‌విలేజ్ బేరర్స్‌లైన్‌లోని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో, రెండవ వార్డు వల్లభాయ్‌పటేల్ నగర్‌లో అజ్జుభాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలో పాల్గొన్న టీడీపీ నేతలు

అడ్డగుట్ట: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కాత విజయ్‌కుమార్ నేతృత్వంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లరావు శ్రీనివాస్ కేక్‌కట్ చేశారు. అనంతరం పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, చందర్, గణేష్, నర్సింహ్మా, ప్రసాద్‌రావు, సురేష్, రామస్వామి పాల్గొన్నారు.

పాలకమండలి నియామకం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ గణపతి దేవాలయానికి నూతన పాలకమండలిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా హనుమంత రావు, వనరాస వజీర్ మోహన్, పల్లె సధానంద్ గౌడ్, జిజ్జువరపు వినోద్, పద్మజ, జయరాజ్, రామ్మోహన్, సింధం శ్రీశైలం, మాధవి, సత్యనారాయణ, అశోక్ కుమార్, ఆంజనేయులు, బాబురావులను నియమించారు.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన

అమీర్‌పేట: సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి గురువారం ఎల్ఐజీ–1, 2 కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు.100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్థానికంగా పర్యటించి సమస్యలపై చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట దామోదర్‌రెడ్డి, మోహన్, మానిక బాల్‌రెడ్డి, అనంతరెడ్డి, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

ఉరేసుకుని స్టాఫ్‌నర్స్ ఆత్మహత్య

అమీర్‌పేట: సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సు ఆత్మహత్యకు పాల్పడింది. ఆలంపూర్ జోగులాంబ జిల్లా గద్వాలకు చెందిన అంజలీ మాధవి (32) స్టాఫ్‌నర్సుగా పనిచేస్తూ సనత్‌నగర్ తులసీనగర్‌లో ఉంటుంది. ఇటీవల ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. గురువారం ఉదయం డ్యూటీకి రాకపోవడంతో స్నేహితురాలు మేరీ పలు మార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. మధ్నాహ్నం డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చింది. తలుపులు తట్టినా తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు విరగొట్టి చూడగా మాధవి చీరతో ఉరి వేసుకుని కనిపించింది. సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిరాజ్ తెలిపారు.

కరోనా బాధితులను దిల్‌తో చూశా!

- సమాజం ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నా
- రెండేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నా
- నేటితో సూపరింటెండెంట్‌గా రాజారావుకు మూడేళ్ల పూర్తి

గాంధీఆస్పత్రి : ఆప్యాయత, అనురాగం, అనుబంధాలే ముఖ్యమని, మానవ సంబంధాలకు విలువ కట్టలేమని, కరోనా విజృంభించిన సమయంలో ఈ సంబంధాలు ఎంతగా విచ్ఛిన్నం అయిపోయాయో, తర్వాత మనుషుల మధ్య అంతగా పెనవేసుకున్నాయి. కరెన్సీ కట్టలు, ఎకరాల భూమి, బంగ్లాలు, విలాసవంతమైన జీవితం తలకిందులై పోయాయి. కొంతమంది ధనిక బాధితులు ప్రాణం నిలబెడితే కోట్లాది రూపాయలు, విలువైన ఆస్తులు ఇస్తామని ప్రాధేయపడ్డారు. చిల్లిగవ్వ కూడా వెంట తీసుకు వెళ్లలేకపోయారు. కరోనా మహమ్మారి అనేక కుటుంబాలను తలకిందులు చేసున్న సమయంలో గాంధీ వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించి లక్షలాది మందికి పునర్జన్మ ప్రసాదించారని నాటి ఘటనలను గుర్తు చేసుకున్నారు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు. మూడేళ్ల క్రితం 2020 ఏప్రిల్ 20న సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందడంతో ఈ క్లిష్టసమయంలో పదవికి న్యాయం చేయగలనా అని ఆలోచించాను. అప్పటి వైద్య మంత్రి, ఉన్నతాధికారులు, తోటి వైద్యులు వెన్నుతట్టి ప్రోత్సాహించడంతో రంగంలోకి దిగాను. ఈ 36 నెలల్లో 20 నెలలు గాంధీ ఆస్పత్రి కోవిడ్ నోడల్ సెంటర్‌గా ఉంది. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. పీపీఈ కిట్ వేసుకుని వార్డుల్లోకి వెళ్లి కరోనా బాధితులను స్వయంగా కలిసి ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పేవాడిని. మందులు లేని తరుణంలో స్టెరాయిడ్స్‌తో కరోనాను నియంత్రించవచ్చని చెప్పాను. కొన్ని నెలల తర్వాత అమెరికా జరిపిన పరిశోధనలో అదే నిజమని తేలింది.

యాడ్ చేస్తే రూ. కోట్లు ఇస్తామన్నారు..

కరోన సమయంలో కొన్ని ఫార్మాస్యూటికల్, శానిటైజర్ కంపెనీలు తమ ప్రొడక్ట్‌కు సంబంధించి మీతో యాడ్ తీస్తామని కోట్లాది రూపాయలు ఆఫర్ చేశాయి. చికిత్స పొందుతున్న కొంతమంది బాధితులు ప్రాణాలు కాపాడితే డబ్బులు, ఆస్తులు ఇస్తామన్నారు. అన్ని ఆఫర్‌లను సున్నితంగా తిరస్కరించాను. కరోనా పాండమిక్ సమయంలో వైద్యసేవలు అందించడం ఒక ఎత్తయితే, వైరస్ అనుపానులు తెలుసుకోవడం మరో ఎత్తు. కరోనా



కరోనా సమయంలో పీపీఈ కిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజారావు

జెనెటిక్ స్టడీలో భాగంగా జీనోమ్ సీక్వెన్సింగ్‌లో రూపాంతరం (మ్యూటేషన్) చెందిన పది రకాల కరోనా సబ్ వేరియంట్లను కనుగొన్నారు. వీటిలో రెంటింటికి ఎమ్ఆర్ఆర్ (ఎం.రాజారావు) పేరు పెట్టారు. మరో రెండు వేరియంట్లకు గాంధీ వైద్యులు నాగమణి, త్రిలోక్‌చందర్ పేర్లు పెట్టారు.

బాధ్యతగా భావిస్తున్నా..



సమాజం ఇచ్చిన బాధ్యతను సక్రమంగా తీర్చుకుంటున్నాను. కరోనా సమయంలో రోజుకు 16 నుంచి 18 గంటలు విధుల్లో ఉన్నా. గైనకాలజీ, డెర్మటాలజిస్ట్ అయిన భార్య డాక్టర్ పాయల్, పిల్లలు అందించిన ప్రోత్సాహం మరువలేనిది. నా ఫొటోలకు పూలు, పాలాభిషేకాలు చేశారు. ఇప్పటికీ చాలా మంది ఇళ్లలో నా ఫొటోలు పెట్టుకోవడం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తా. సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు, ఇతర వైద్య ఉన్నతాధికారులు, తోటి వైద్యులు, సిబ్బంది అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



పార్కు సుందరీకరణ పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళ

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజావసరాలకు అనుగుణంగా ప్రజాభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధి పద్మారావునగర్‌లో గురువారం రూ. 74.40 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన కార్పొరేటర్ హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పద్మారావునగర్ ఏరియాలో గతంలో ఎన్నడూలేని విధంగా లక్షలాది రూపాయలతో కాలనీల్లో రోడ్లు, పార్కుల సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. ప్రజలు సూచించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు సహకరించాలని కోరారు. వెంకటాపురం కాలనీలో పార్కును సుందరంగా తీర్చిదిద్దారని అవవింద వల్లి అనే మహిళ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పద్మారావునగర్ పరిసర ప్రాంతాల్లో అడ్డుగా ఉన్న విద్యుత్తు తీగలను తొలగించి చెట్టు కొమ్మలను తీసేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్, ఏడీఈ మహేష్, ఏసీపీ క్రిస్టోఫర్ నాయకులు బాల్‌రెడ్డి, ఏసూరి మహేష్, జనార్ధన్, రాజు, సురేష్, సుధాకర్ రెడ్డి, ముక్కా శ్రీనివాస్, వెంకట్ ముదిరాజ్, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి



కార్ఖాన ఈద్గా వద్ద ఊడుస్తున్న దృశ్యం

రసూల్‌పురా: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు ఈద్గాలు సిద్ధమవుతున్నాయి. కంటోన్మెంట్ బోర్డు విభాగానికి చెందిన శానిటేషన్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు పదివేల మంది ప్రార్థనలు చేసే బాలంరాయిలోని బడీ మసీద్ ఈద్గా, కార్ఖనా బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ఈద్గాల వద్ద శానిటేషన్ విభాగం అధికారుల ఆదేశాల మేరకు దఫేదార్లు రాజేష్, రామకృష్ణ ఆధ్వర్యంలో జానిమాజ్‌లు, టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటర్‌వర్క్స్ అధికారులు తాగునీటి వసతి కల్పిస్తున్నారు.

సామాజిక అంశాలపై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో సామాజిక అంశాలపై గురువారం సదస్సు జరిగింది. దేశంలో మారుతున్న సామాజిక సాంస్కృతిక ప్రకృతి దృశ్యం అనే అంశం పై జరిగిన సదస్సు హెడ్ ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా బీబీసీ తెలుగు ఎడిటర్ జీఎస్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక సమస్యలు రాజకీయ అంశాలతో ఎలా ముడిపడి పాలన కొనసాగుతుందో వివరించారు.



మాట్లాడుతున్న జీఎస్ రామ్

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అడ్డగుట్ట: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో మజ్దూర్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు అన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని సీపీఓ కాన్ఫరెన్స్ హాల్లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ.. రైల్వే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. రైల్వే స్టేషన్లలో కార్మికులు, ఉద్యోగులకు ఉచిత పార్కింగ్ కల్పించాలని చేసిన డిమాండ్‌కు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత

చిలకలగూడ : ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాన్ని గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు నేలమట్టం చేశారు. చిలకలగూడ పెట్రోల్‌బంక్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న ఖాళీస్థలంలో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా నాలుగు మడిగలను నిర్మించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు సికింద్రాబాద్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ముంతాజ్‌బేగం ఆధ్వర్యంలో గురువారం కూల్చివేశారు. 2016లో ఇదే ప్రదేశంలో శిథిలావస్థలో ఉన్న భవనం కూలి ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారని స్థానికులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

‘ఇంటింటికీ సీపీఐ’కి విశేష స్పందన



ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఐ నేతలు

బౌద్ధనగర్: మోదీ హటావో దేశ్‌కో బచావో అనే నినాదంతో నిర్వహిస్తున్న ఇంటింటి సీపీఐ పార్టీకి విశేష స్పందన లభిస్తుందని పార్టీ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ తెలిపారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో నిర్వహిస్తూ మాట్లాడారు. ప్రధాని మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నామని పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు తీవ్రమైన ఆగ్రహంలో ఉన్నారన్నారు. ఈ సారి బీజేపీ పతనం తప్పదని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తుందన్నారు. భిన్నత్వాన్ని ధ్వంసం చేస్తూ రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెడుతుందన్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో దేశాన్ని రక్షించడం కోసమే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉమర్ఖాన్, యూసుఫ్, లతీఫ్, లక్ష్మణ్, సయ్యద్ షకీల్, కళ్యాణ్, మాధవులు పాల్గొన్నారు.

కలెక్టర్ అనుమతి మేరకే భవనం కూల్చివేత

సికింద్రాబాద్: జిల్లా కలెక్టర్ కార్యాలయ అనుమతి పొందిన తర్వాతే సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాత భవనం కూల్చివేత పనులు ప్రారంభించామని జీ.కృష్ణమూర్తి అండ్ సన్స్ కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు అనుమతి తెచ్చారని చెప్పారు. అప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల భవనంలోనే కళాశాలల తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులు చెట్ల కింద పాఠాలు నేర్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన పద్మారావుగౌడ్ సిఫారసు మేరకు కొత్త భవన సముదాయం నిర్మాణం కోసం రూ.29.75 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పాత భవనాన్ని మరమ్మతు చేసే పరిస్థితులు ఎంత మాత్రం లేవని ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగానే కొత్త భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కళాశాల, విద్యాశాఖకు చెందిన పలువురు ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణపు అంచనా వ్యయం ఖరారు చేశారన్నారు. నిర్మాణం కోసం తమ సంస్థ అనుమతులు పొందడంతోపాటు, పాతభవనాల కూల్చివేతలకు సైతం జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇదిలా ఉండగా సోషల్ డెమోక్రెటిక్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి బృందం పాఠశాలను సందర్శించి కమీషన్ల కోసమే విద్యా భవనాన్ని నిర్మిస్తున్నట్టు రాజకీయ విమర్శలు చేయడం విచారకరమన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి పూర్తి విషయాలు తెలుసుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేసి, భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేపై బురదజల్లే విధంగా ఎస్‌డీఎఫ్ ప్రతినిధులు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలి

అడ్డగుట్ట: ప్రతి కార్మికుడు లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరీ నాగరాజు సూచించారు. గురువారం అడ్డగుట్టలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాకాల యాదగిరి, బాలరాజు, రామ్‌చందర్, యాదగిరి, శంకర్, అంజయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లాలాపేట: నగరంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి మే 31వ తేదీ వరకు 37 రోజుల పాటు వివిధ క్రీడల్లో శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు వారు శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

దివ్యాంగులకు తోడ్పాటు అందించాలి

కంటోన్మెంట్: దివ్యాంగులు స్వయంశక్తితో ఎదిగేలా వీలైనంత తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్నారు. బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటిస్ (నిపిడ్)లో జరుగుతున్న ‘ట్రాన్స్‌ఫర్మేటివ్ సొల్యూషన్స్ అండ్ ఇన్నోవేషన్స్ ఇన్ డిజేబులిటీ రీ హ్యాబిలిటేషన్–2023’ రెండు రోజుల కాన్ఫరెన్స్‌ను ఆయన ప్రారంభించారు. దివ్యాంగులకు అందిస్తున్న సేవలు, డిజిటల్ బోర్డులపై శిక్షణ ఫలితాలపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిపిడ్ డైరెక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్ రెడ్డి, డాక్టర్ శిల్పా, డాక్టర్ అమృత సహాయ్, దశరథ్ పాల్గొన్నారు.



నిపిడ్ ఉద్యోగులతో కేంద్ర మంత్రి డా.వీరేంద్ర కుమార్

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం




స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు పిల్లలను సమ్మర్ క్యాంపుల్లో చేర్పించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం ఎస్పీరోడ్‌లోని గురుమూర్తి స్విమ్మింగ్‌పూల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న జిమ్‌ను పరిశీలించి నిర్వాహకుల కోరిక మేరకు అత్యాధునిక పరికరాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బేగంపేట, అమీర్‌పేట్, సనత్‌నగర్‌లలో స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయని ఆసక్తి ఉన్న వాళ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడి, ఈఈ సుదర్శన్ నాయకులు శ్రీహరి, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదలతో కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీ రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం నిర్వహించిన వెస్ట్ మారేడుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి తమలోని శక్తిని గుర్తించి తాము ఎంచుకున్న దానికి అనుగుణంగా ముందుకు అడుగులు వేయాలన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ రచనలు చదివి వాటి నుంచి ప్రేరణ పొందాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. శేషగిరిరావు, రాజశేఖర్, విజయప్రసాద్, డాక్టర్ అరుణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఓయూ వీసీ తదితరులు

మహిళలు పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


రాంగోపాల్‌పేట్: మహిళల ముందుండి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు అన్నారు.గురువారం సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం భవనంలో జరిగిన మహిళా కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజులు కాంగ్రెస్ పార్టీవేనని అధికారంలోకి వచ్చేందుకు ముందుండి సమస్యలు పరిష్కరించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పాలన్నారు. కవిత, నాగేందర్‌రాజ్, రజినిప్రియ, ప్రకాష్, మణిమాల, పద్మ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహేష్ కొంగరకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: సినిమాల్లో దళిత హీరోయిజంపై చేసిన పరిశోధనకు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మహేష్ కొంగరకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీలో డాక్టరేట్ ప్రకటించింది. వర్సిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆయన ఈ పట్టా అందుకున్నారు. దివంగత ప్రొఫెసర్ బి.బాలస్వామి మరణానంతరం డాక్టర్ టి.సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో ‘దళిత్ అసర్షన్ అండ్ మీడియా ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ తెలుగు ఫిల్మ్స్’ అనే అంశంపై రీసెర్చ్ థీసిస్ సమర్పించారు. ఇందులో భాగంగా బలిపీఠం (1975), స్వయంకృషి (1987), ఒసేయ్ రాములమ్మ (1997), పలాస 1978 (2020), లవ్ స్టోరీ (2021) సినిమాల్లోని ప్రధాన పాత్రలను తన పరిశోధనకు ఎంచుకున్నట్టు మహేష్ తెలిపారు.

ఫీజుల పెంపుపై కరపత్రం విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ కోర్సుల ట్యూషన్ ఫీజు పెంపు పై విద్యార్థులు నిరసన చేపట్టారు. పెంచిన ఫీజును తగ్గించాలని దేశంలోని వివిధ వర్సిటీల్లో అమలవుతున్న ఫీజుల వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల మాట్లాడుతూ.. ఐదేళ్లలో కేవలం 48 రోజుల నామా మాత్రపు తరగతి గది బోధనకు రూ.20 వేల నుంచి రూ.1.20 లక్షలకు ట్యూషన్ ఫీజును పెంచడం దారుణమన్నారు. పెంచిన ఫీజును తగ్గించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్య, ఆజాద్, రవినాయక్, మహేష్, కిరణ్, గోవర్ధన్, రవి, వెంకట్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై జారిపడి చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌రైల్వే స్టేషన ప్లాట్ ఫాం నెం–1లోని చివరిలో గురువారం మధ్యాహ్నం సమయంలో సుమారు 35–40 ఏళ్ల మధ్య వయస్సున్న ఓ వ్యక్తి పట్టాలపై జారి పడ్డాడు. తలకు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. పరేడ్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్ సమీపంలో 65–70 వయస్సున్న మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన కుల్‌దీప్(37)కు జయ అనే మహిళతో ఏడాది క్రితమే వివాహం కాగా ఇద్దరు మోతీనగర్‌లో ఉంటున్నారు. కొన్ని రోజులకే కుటుంబ కలహాలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి ఇద్దరు గొడవ పడి వేర్వేరు గదుల్లో పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి కుల్‌దీప్ చున్నీతో ఉరేసుకున్నాడు. కిందకు దింపి చూడగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించి మూసాపేటలో తండ్రి మధుసూదన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. భార్యాభర్తలు తరుచూ గొడవలు పడగా కౌన్సిలింగ్ కూడా చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈ–పెట్టీ కేసులో పది మందికి జైలు

అడ్డగుట్ట: వివిధ నేరాలకు పాల్పడిన పది మందికి ఈ–పెట్టీ కేసులో జైలు శిక్ష విధించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధులత వివరాల ప్రకారం. లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రుల సమయాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న 7 మంది, ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులతో పాటు బస్తీలో న్యూసెన్స్ చేస్తున్న ఓ మహిళపై కూడా ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. వీరిని గురువారం సికింద్రాబాద్‌లోని 16 స్పెషల్ ఎంఎం కోర్టులో మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న హరినాథ్, మహేష్, రాదపాక నరేష్, బిలాల్ తాసి, దేరంగాల స్వామి, ఎస్. వెంకటేష్, జీ. వెంకటేష్‌లకు వారం నుంచి పది రోజుల పాటు జైలు శిక్ష, జయలక్ష్మికి వారం రోజులు, ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న స్టీఫెన్, సుమేర్ అశ్రఫీలకు నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.